# అసలు నిజం

**సాయంకాలం, ఆరు గంటలు కావస్తూంది. ఎండవేడిమి తగ్గి పోతూ సాయంకాలపు చల్లటి గాలులు వీస్తున్నాయి. వాతావరణం ఆహ్లాదంగా ఉంది.**

ఆరోజు భారతదేశంలో సైబర్ సిటీగా పేరొందిన హైదరాబాద్ నగరంలో ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీ ఆవరణ రంగు రంగుల విద్యుద్దీపాల కాంతులతో స్వాగత తోరణాలతో ఎంతో అందంగా చూడముచ్చటగా ఉంది.

ఆ కంపెనీలో పనిచేసే ఓ సాధారణ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కి ఆ కంపెనీ యాజమాన్యం, రాష్ట్ర పరిశ్రమలశాఖా మంత్రి చేత సన్మానం చేయిస్తోంది. మంత్రి రాక కోసం అందరూ ఎదురు చూస్తున్నారు.

న్యూయార్క్‌లో జరుగబోయే ఇంటర్నేషనల్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్స్ మీట్‌లో పాల్గొని, తర్వాత అక్కడి ప్రముఖ కంపెనీలలో మూడు సంవత్సరాల ట్రెయినింగ్ పొందటానికి, కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన టెస్ట్‌లో సెలెక్టయిన ఏకైక వ్యక్తి ఆ కంపెనీలో పనిచేసే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సుబ్బారావు.

కొన్ని కోట్ల రూపాయలు ఖర్చుపెట్టినా సాధించలేనంత పబ్లిసిటీని సుబ్బారావు విజయం ఆ కంపెనీకి సాధించి పెట్టింది. కంపెనీ పేరు భారతదేశ నలుమూలలా మ్రోగిపోయింది. ఆ విజయాన్ని మరింత సొమ్ము చేసుకోవాలన్న ఉద్దేశంతో ఏర్పాటు చేశారు ఆ సన్మాన సభా కార్యక్రమం.

వచ్చీపోయే కార్లతో, అటూ ఇటూ తిరిగే బేరర్లతోను ఆవరణమంతా హడావిడిగా ఉంది. కంపెనీలో పనిచేసే సిబ్బంది అందరూ వాళ్ళ భార్యాపిల్లలతో రాసాగారు. చిన్నపిల్లల కేరింతలతో, పట్టుచీరల రెపరెపలతో, పలకరింపులతో వాతావరణంలో సందడి చోటు చేసుకోసాగింది.

ఆరున్నర గంటలకి సుబ్బారావు సతీసమేతంగా (మొదటిసారి) కంపెనీ కారులో వచ్చాడు. కారు దిగీ దిగకమునుపే అక్కడ చేరిన వారందరు పోటీలు పడి సుబ్బారావుని అభినందించారు. కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ సతీమణి సుబ్బారావు భార్యతో పరిచయం చేసుకుని, మిగతావారికి పరిచయం చేయటానికి తన వెంట తీసుకెళ్ళింది.

మరో ఐదు నిముషాల తర్వాత రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి కారు ఆవరణలో ప్రవేశించింది. పూలమాలలతో బ్యాండు మేళాలతో ఆయనకు స్వాగతం పలికారు ఆ కంపెనీ మేనేజింగ్ డైరెక్టరు. సుబ్బారావుని ఆయనకు పరిచయం చేశారు.

సన్మాన సభ ప్రారంభమైంది. వక్తలందరూ సుబ్బారావుని అతడు సాధించిన విజయాన్ని ఆకాశమంత ఎత్తుకు పొగుడుతూ ప్రసంగించారు. మంత్రివర్యులు సుబ్బారావును వేదమంత్రాల నడుమ తిలకం దిద్ది, శాలువా కప్పి సన్మా



నించారు. మిత్రులు పూలదండలతో సత్కరించారు. కంపెనీ వారు సుబ్బారావుకి ఓ మారుతీ కారు, లక్ష రూపాయల నగదు బహుమతి ప్రకటించారు.

చివరగా సుబ్బారావు తనకు జరిపిన సన్మానానికి పేరు పేరునా కృతజ్ఞతలు తెలుపుకుంటూ- ''ప్రతి మగవాడి విజయం వెనుక ఓ స్త్రీ ప్రోత్సాహమున్నట్లే, ఈ నా విజయం వెనుక నా భార్య ప్రోత్సాహం ఉంది. ఆ ప్రోత్సాహమే లేకుంటే నేను ఈ విజయాన్ని సాధించి ఉండలేను. ఇందుకై ఆమెకు సభాముఖంగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను'' అని ముగించాడు. కరతాళ ధ్వనులతో సభ ముగిసింది. అక్కడ చేరిన ఆడవాళ్ళందరూ స్త్రీల గౌరవ మర్యాదలు నిలబెట్టినందుకు సుబ్బారావు సతీమణిని అభినందించారు.

భోజనాల తర్వాత అందరి దగ్గర వీడ్కోలు తీసుకుని కంపెనీ బహుకరించిన కారులో ఇంటికి వస్తూ సుబ్బారావు సతీమణి- ''ఏమండీ అంతమందిలో నేను మీకు ప్రోత్సాహమిచ్చినట్టు పొగిడారు కదా. అసలు నేనెప్పుడు, ఎలా మిమ్మల్ని ప్రోత్సాహపరిచానో చెప్పరూ'' గోముగా అడిగింది.

''నిజంగానే నువ్వు నన్ను ప్రోత్సాహపరిచావు. నీ ప్రోత్సాహమే లేకుంటే ఈ విజయాన్ని సాధించి ఉండలేను. నేను నిస్వార్థంతో చేసే ప్రతి పనిలో వంకలు పెడుతూ, తప్పులు పడుతూ దెప్పిపొడిచేదానివి. చివరకు ప్రేమతో నీకు మల్లె పూలు తీసుకువచ్చినా మీకు ఇటువంటి పూలేనా దొరికేవి అనే దానివి. పాలు తీసుకొచ్చినా, పట్టుచీర కొనుక్కు వచ్చినా నాలో అసమర్థత వెదుకుతూ నన్నో చేతగాని వాజమ్మలా చూస్తూ, పదిమందిలో చులకన చేస్తూ మాట్లాడేదానివి. నా మీద నాకే నమ్మకం లేని స్థితిలోకి నన్ను తీసుకెళ్ళావు. ఏ పనైనా చేయాలంటే, ఈ పని నేను చేయగలనా అని బెరుకు, భయం. అనుక్షణం అదే ఆలోచన, ఎలా? విడాకులిచ్చే ధైర్యం లేదు. చట్టబద్ధంగా నీ మాట, పలుకూ విననంత దూరంగా పారిపోవాలి ఎలా ఎలా?

ఈ ఆలోచనల్తో నాలో నేను సతమతమవుతున్నప్పుడు ఎడారిలో ఒయాసిస్సులా, అద్భుతమైన అవకాశం వచ్చింది. సెలెక్ట్ అయితే మూడేళ్ళు నీ నుండి దూరంగా ఉండవచ్చు. ఆలోగా నువ్వు మారకపోతే అలానే కంటిన్యూ కావచ్చు. పట్టు విడవకుండా ప్రిపేరయ్యాను. నిదురబోతే కలల్లోను, అలిసిపోయి కనులు మూసుకుంటే కనుల ముందరా నీ రూపమే కనబడేది. నిదుర, బద్ధకం రెండూ వదిలేవి. అహర్నిశలు శ్రమించాను. టెస్ట్ తప్ప ఇంకేమీ కనబడేది కాదు. కష్టానికి ఫలితం దక్కింది. పరీక్షలో నెగ్గాను. ఏకైక వ్యక్తిగా సెలెక్టయ్యాను. మరి నిజంగా నీ ప్రోత్సాహమే ఈ రూపంలో లేకుండా ఉంటే ఈ అద్భుత విజయాన్ని నేను సాధించగలిగి ఉండేవాడినా నువ్వే చెప్పు'' అంటూ బదులిచ్చాడు సుబ్బారావు.

అసలు నిజం తెలుసుకుని అపరకాళికే అయ్యిందో, తప్పు తెలుసుకుని సరిదిద్దుకుందో, సుబ్బారావుకే తెలియాలి తరువాత సంగతి.

**-ధనిరెడ్డి రామమనోహర్ రెడ్డి** (కడప)